సాక్షి
నిజామాబాద్
సోమవారం ǀ 9 ǀ డిసెంబర్ ǀ 2024



దినకర్మకు వస్తూ..

బంధువు దినకర్మలో పాల్గొనడానికి స్వగ్రామానికి వస్తున్న తల్లి, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

- 8లో ▸



నాటుడు.. నరుకుడు

నందిపేట మండల కేంద్రంలోని రోడ్డు పక్కన ఉన్న చెట్లు నరికివేతకు గురవుతున్నాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /20.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురియవచ్చు. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కే శ్రీనివాస్, కోశాధికారిగా బీఆర్ రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా మాన్యం పావని, జి సునీల్, సంయుక్త కార్యదర్శులుగా ఎం ప్రతిభ, సౌజన్య, బి రాజ్‌కుమార్‌రెడ్డి, జి గంగాదాస్, ఈసీ మెంబర్లుగా ఎన్ శ్రీనివాస్, ఎం సంతోషి, ఏ శ్యామల, వి కల్పన, డి సునీల్, నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మోపాల్: నగరంలోని వినాయక్‌నగర్ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వినాయకనగర్, గూడెం, 100 ఫీట్ రోడ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, కోటగల్లి, గాయత్రీనగర్, ఆకులపాపయ్య రోడ్, చందానగర్, న్యాల్‌కల్ రోడ్, శ్రీనగర్ కాలనీ, పూలాంగ్, గోల్ హనుమాన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెటర్నరీ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వెటర్నరీ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కామారెడ్డిలోని పర్ణిక హోటల్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సొడయ్య యాదవ్, రాష్ట్ర ప్రతినిధులు కే.రామారావు, రవీందర్‌రెడ్డి, వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ సాగింది. ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్వరరావు, అధ్యక్షుడిగా మహీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రావుల గౌతమ్, ఉపాధ్యక్షుడిగా వెంకటరావు, కోశాధికారిగా రాములు, ప్రచార కార్యదర్శిగా బాలయ్య, కార్యవర్గ సభ్యులుగా రాజు, సీహెచ్.గంగారాం, అశోక్, చంద్రశేఖర్, రామకృష్ణ ఎన్నికయ్యారని సంఘం ప్రతినిధులు తెలిపారు.

బ్రహ్మానందం సందడి



కామారెడ్డి టౌన్: ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ఆదివారం కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఇంటికి వచ్చారు. అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మానందంతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

రచ్చకెక్కిన స్వధార్ హోం

ఆపదలో ఉన్న మహిళలకు ఆశ్రయం కల్పించాల్సిన స్వధార్ హోం వివాదాలకు కేంద్రమైంది. తమను అధికారులు వేధిస్తున్నారని, బాడీ మసాజ్‌లు చేయించుకుంటున్నారని హోంలో ఆశ్రయం పొందుతున్న వారు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. దీని వెనుక అసలు ఉద్దేశం వేరని, హోంలో అసలు బాధిత మహిళలు లేకుండా చేసి మరో ఎన్జీవోకు బాధ్యతలు అప్పగించేందుకే అధికారులు ఇదంతా చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హోం నిర్వహణ నిధులు పెరగడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.





- సుమారు 20 మంది పునరావాసానికి రూ.30లక్షలు
- బాధిత మహిళలకు దక్కని గౌరవప్రద జీవితం!
- అధికారుల వ్యవహారశైలిపై ఫిర్యాదులు
- గందరగోళ పరిస్థితికి నిధుల కేటాయింపు పెరగడమే కారణమా?
- ఎన్జీవో రద్దుకు గతంలోనే కమిషనర్‌కు లేఖరాసిన డీడబ్ల్యూవో

నిజామాబాద్ నాగారం: ఆపదలో ఉన్న, సామాజిక, ఆర్థిక మద్దతు లేని మహిళలకు ఆశ్రయం కల్పించే ఉద్దేశంతో జిల్లాలో రెండు స్వధార్ హోంలు ఏర్పాటయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 2005లో జిల్లా కేంద్రంలోని గౌతంనగర్, బోధన్‌లో హోమ్‌లను ఏర్పాటు చేసి నిర్వహణను ఎన్జీవోలకు అప్పగించారు. ఒక్కో బాధితురాలు హోమ్‌లో నాలుగేళ్ల వరకు ఉండడంతోపాటు కొత్త జీవితం ప్రారంభించేలా ప్రోత్సహిస్తారు. మహిళ సంక్షేమశాఖ పర్యవేక్షిస్తుండగా, నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్‌లో ఉన్న స్వధార్ హోంలో గత కొన్నేళ్లుగా సుమారు 20మందిలోపు బాధిత మహిళలు ఆశ్రయం పొందుతున్నారు. అయితే ఇందులో ఆశ్రయం పొందేందుకు వచ్చిన మహిళలు రెండు మూడు నెలలకే ఎందుకు వెళ్లిపోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా స్వధార్ హోం నిర్వహణను చూస్తున్న ఎన్జీవో సరిగా పట్టించుకోవడం లేదని, సంస్థను రద్దు చేయాలని డీడబ్ల్యూవో గతంలోనే శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు.

బాధితులు లేకుండా చేసేందుకేనా?

హోంలో ఆశ్రయం పొందుతున్న మహిళలు తమను అధికారులు వేధిస్తున్నారని ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సూపరింటెండెంట్‌తోపాటు జిల్లా సంక్షేమాధికారి తమతో ఇంట్లో పనులు, బాడీ మసాజ్‌లు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీనికంతటికీ కారణం స్వధార్ హోంకు కేటాయిస్తున్న నిధులు పెంచడమే కారణమని, ప్రస్తుత ఎన్జీవోకు కాకుండా మరో ఎన్జీవోకు అప్పగించేందుకే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హోమ్‌లో అసలు బాధితులు లేకుండా చేస్తే మరో ఎన్జీవోకు అప్పగించేందుకు మార్గం సులువవుతుందనే ఆలోచనతో ఆశ్రయం పొందుతున్న మహిళలను వేధిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. 2005 నుంచి ప్రతి ఏడాది రూ.14లక్షల 50వేలు మాత్రమే ఇచ్చారు. అయితే 2023 నుంచి పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులను రూ.30లక్షలకు ప్రభుత్వం పెంచింది. బాధితుల సంఖ్య 50 వరకు ఉంటే రూ.50లక్షల పైనే నిధులు వస్తాయి. మంజూరైన నిధులను భవనం అద్దె, జీతభత్యాలు, భోజన సదుపాయాలు, బాధిత మహిళలకు శిక్షణ ఇప్పించేందుకు ఉపయోగించాలి.

రక్షణకు ఏర్పాట్లు

స్వధార్ హోంలోకి ఎవరికీ అనుమతి ఉండదు. ఎన్జీవోలు బాధ్యతాయుతంగా నిర్వహించాలి. సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఏవైనా ఇబ్బందులు, సమస్యలుంటే పరిష్కరించేందుకు కమిటీ ఉంటుంది. గతేడాది ఏప్రిల్‌లో మహిళ కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి గౌతంనగర్‌లోని స్వధార్ హోంను పరిశీలించారు. భవనంలో మార్పులు, చేర్పులు చేసి మహిళల రక్షణకు మరిన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను, ఎన్జీవో బాధ్యులను ఆదేశించారు. తొమ్మిది పాయింట్లతో ఎన్జీవోకు నోటీసు ఇచ్చారు. ఆ తరువాత భవనం చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతోపాటు కొన్ని మార్పులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

డీఎంహెచ్‌వో విచారణ

స్వధార్ హోంను పర్యవేక్షించాల్సిన అధికారులు తమను వేధిస్తున్నారని, సొంత పనులు చేయించుకుంటున్నారని బాధితులు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై దృష్టి సారించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు విచారణ చేపట్టాలని డీఎంహెచ్‌వో రాజశ్రీని ఆదేశించారు. ఈ నెల 5వ తేదీన రాత్రి డీఎంహెచ్‌వో స్వధార్ హోంలో బాధితులతో మాట్లాడారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు సమాచారం. కలెక్టర్ నిర్ణయం కోసం బాధితులు ఎదురుచూస్తున్నారు. విచారణ నివేదిక ద్వారా వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఎన్సీఎస్ఎఫ్‌లో బెల్లం ఉత్పత్తి చేయాలి

- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య డిమాండ్



చెరుకు రైతులతో ఆకుల పాపయ్య

నిజామాబాద్ రూరల్: సారంగాపూర్ చక్కెర(ఎన్సీఎస్ఎఫ్) ఫ్యాక్టరీలో బెల్లం ఉత్పత్తి చేయాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. దేశంలో బెల్లంకు డిమాండ్ ఉందని, దానిపై జీఎస్టీ, సీజీఎస్టీ లేనందున బెల్లం ఉత్పత్తికి మంచి అవకాశమని అన్నారు. మండలంలోని జలాల్‌పూర్‌లో చెరుకు రైతులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల తప్పుడు విధానాలు, అధికారుల అలసత్వం కారణంగా సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ మూతపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల సమయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతులు చెరుకు పండించేందుకు ముందుకు వస్తున్నారని, ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరిచే ప్రక్రియ చేపడితే వారిలో మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో చెరుకు రైతు ఎఫ్ఈవో చైర్మన్ నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు టి కృష్ణాగౌడ్, సాయిలు, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో భారీ వర్షం

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలో ఆదివారం సాయంత్రం సుమారు అరగంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురియడంతో యాసంగి సాగుకు భూములను సిద్ధం చేయడం సులువవుతుందని పేర్కొంటున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- పొతంగల్, రుద్రూర్, చందూర్‌కు 108 అంబులెన్స్‌లు
- కోటగిరి ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశాం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పొతంగల్(రుద్రూర్)/వర్ని: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి పొతంగల్, రుద్రూర్, చందూర్‌లో 108 అంబులెన్స్‌లను పోచారం ఆదివారం ప్రారంభించారు. ఆయా చోట్ల ఈ సందర్భంగా పోచారం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా 224 అంబులెన్స్‌లను సీఎం ప్రారంభించారని, ఇందులో బాన్సువాడ నియోజక వర్గంలోని రుద్రూర్, పొతంగల్, చందూర్ మండలాలకు 108 అంబులెన్స్‌లను కేటాయించారన్నారు. అలాగే పల్లె, బస్తీ దవాఖానల ద్వారా వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కోటగిరిలోని 10పడకల ఆస్పత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశామని, భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కొత్తగా చందూర్, నస్రుల్లాబాద్ మండల కేంద్రాలకు పీహెచ్‌సీలు మంజూరైనట్లు వెల్లడించారు. రుద్రూర్ పీహెచ్‌సీ పరిధిలోని వర్నిలో ఉప ఆరోగ్య కేంద్రానికి పక్కా భవనం అవసరమని డాక్టర్ ఆయేషా ఎమ్మెల్యేకు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, ఏఎంసీ చైర్మన్ గైక్వాడ్ హన్మంతు, మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్, గందపు పవన్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎన్ గంగాధర్, రాయకూర్ విండో వైస్ చైర్మన్ తోట అరుణ్‌కుమార్, రుద్రూర్ మండల నాయకులు పత్తి లక్ష్మణ్, బి సంజీవులు, అనిల్ పటేల్, బి గంగారాం, ఎన్ రమేశ్, షేక్ ఖాదర్, కుర్మాజీ సాయిలు, ఎన్ నగేశ్, సొసైటీ చైర్మన్ అశోక్, మాజీ జెడ్పీటీసీ అంబర్‌సింగ్, మాజీ సర్పంచులు సత్యనారాయణ, సాయిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టులతో కవ్విస్తే కటకటాలపాలే..!

- ఆర్మూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి వాట్సాప్ గ్రూప్‌లో దేవతామూర్తులకు సంబంధించి చేసిన పోస్టు రాజకీయంగా దుమారం రేపింది. దీంతో పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.
- బాల్కొండ నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి సోషల్‌మీడియాలో పోస్టు పెడితే ఓ పార్టీ నాయకులు దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

- కేసులతో ఇబ్బందులు తప్పవు
- సోషల్ మీడియాతో జాగ్రత్త



ఖలీల్‌వాడి: ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్.. సోషల్ మీడియాలో మునిగితేలుతున్న ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ పోస్టులతో ప్రమాదకర పరిస్థితులున్నాయి. ఫోన్ చేతిలో ఉంది కదా అని సామాజిక మాధ్యమాల్లో అనాలోచితంగా అసభ్యకర, వ్యంగ్యంగా పోస్టులు పెడుతూ అప్పటికప్పుడు ఆనందం పొందుతున్నవారు చివరకు కటకటాల పాలవుతున్నారు. రాజకీయపార్టీలు ప్రత్యేకంగా సోషల్ మీడియా టీములను నియమించుకుంటున్నాయి. ఆన్‌లైన్ వేదికగా అనవర విషయాల్లో(పోస్టుల్లో) తలదూరిస్తే ఇబ్బందులు కొనితెచ్చుకునే ప్రమాదం ఉంది.

చట్టాలు, శిక్షలు

భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) నేరాల చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తారు. వెబ్, మార్ఫింగ్ చిత్రాలు, వీడియోలు వ్యాప్తి చేసి, ఇతరుల వ్యక్తిత్వాన్ని కించపర్చే విధంగా చేస్తే కేసులు నమోదు చేస్తారు.

- 17 ఆ యాక్ట్ కింద కేసు నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా.
- అసభ్యకరమైన పోస్టులు పెట్టేవారికి 67ఏ ఆఫ్ ఐటీ యాక్టు కింద కేసు, ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా
- ప్రముఖ వ్యక్తుల పేర్లు పెడితే 66డీ ఆఫ్ ఐటీ యాక్ట్ కేసు నమోదు, మూడేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా
- తప్పుడు డాక్యుమెంట్లు సృష్టిస్తే బీఎన్ఎస్ చట్టంలోని 336(4) సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు.
- విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే బీఎన్ఎస్ చట్టంలోని 356(2) సెక్షన్‌తోపాటు పరువునష్టం కింద కేసులు నమోదు చేస్తారు.
- చిత్రాలు, వీడియోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే ఎలక్ట్రానిక్స్ ఎవిడెన్స్ పరిగణించి బీఎన్ఎస్ చట్టంలోని 353(2) సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు.

పోలీసులు ఏం చెబుతున్నారు..

చేతిలో సెల్‌ఫోన్ ఉంది కాదాని ఏది పడితే అది వైరల్ చేయకూడదని స్పష్టం చేస్తున్నారు. అసభ్యకర, అవమానకర సమాచార మార్పిడికి అడ్మిన్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిలో పిల్లలు, యువకులు జాగ్రత్తగా ఉండాలి. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో తరుచూ పోస్టులు పెడితే రౌడీషీట్, సస్పెక్ట్, షీట్, సైబర్‌బుల్లీ షీట్‌లను పోలీసులు తెరుస్తారు. ఈ కేసులు ఒకసారి నమోదు చేస్తే తిరిగి తీసివేయడం కష్టమే.

కేసు నమోదైతే ఇబ్బందులు

- ప్రభుత్వ ఉద్యోగాలు, చదువు, విదేశాలకు వెళ్లేవారు పోలీసుల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. కేసులు నమోదైన వారికి పోలీసులు ఎన్‌వోసీ ఇచ్చేందుకు నిరాకరిస్తారు.
- కేసు నమోదైన వ్యక్తిపై నిరంతరం నిఘా ఉంటుంది. కుటుంబం ఇబ్బందులు పడుతుంది.
- సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా, అసత్య ప్రచారం చేసినా, లైకులు కొట్టినా అంతే సంగతులు. పోలీసు యంత్రాంగం చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది.

ఊరిస్తున్న ఆయిల్‌పామ్

- టన్ను ధర రూ.20వేలు
- నిర్మల్‌లో మొదలైన పంట కోతలు.. అక్కడే పంట సేకరణ కేంద్రం ఏర్పాటు
- జిల్లాలో ఆరు నెలల్లో కోతకు రానున్న పంట



డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ శివారులో ఆయిల్‌పామ్ తోట

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆయిల్‌పామ్ ధర జిల్లా రైతులను ఊరిస్తోంది. పక్కనే ఉన్న నిర్మల్ జిల్లాలో పంట చేతికి రాగా, ఒక టన్ను గెల ధర రూ.20వేల పైనే పలుకుతోంది. అక్కడే పంట సేకరణ కేంద్రాన్ని ఏర్పా టు చేయడంతో రైతులు పంట దిగుబడిని సులభంగా విక్రయిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో కూడా చాలా మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేశారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో మరో ఆరు నెలల్లో పంట కోతకు రానుంది. జిల్లాలో 2022–23 ఏడాది నుంచి ఇప్పటి వరకు 2,198మంది రైతులు 5,471 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేశారు. ఇందులో 60 శాతం పంట మరో ఆరు నెలల్లో కోతకు రానుంది. పంట సేకరణ కేంద్రాలను జిల్లాలో నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లో ఏర్పాటు చేయనున్నారు. ప్రీ యూనిక్ అనే సంస్థ పంటను సేకరించనుంది. నిర్మల్ జిల్లాకు వెళ్లి పంటను విక్రయించే అవకాశం ఉంది.

దిగుబడి ఇలా..

మొక్కలు నాటిన మూడున్నర సంవత్సరాల తరువాత ఎకరానికి 2 నుంచి 3 టన్నుల దిగుబడి వస్తుంది. ఆ తరువాత ప్రతినెలా నాలుగు టన్నుల వరకు దిగుబడి ఉంటుంది. ఇలా సుమారు ఎనిమిది నెలకాలంపాటు దిగుబడి వస్తుంది. టన్ను గెలకు రూ.20వేల ధర లభిస్తే ఎకరానికి రైతులకు గరిష్టంగా పంట కోసిన ప్రతిసారి రూ.లక్ష వరకు ఆదాయం సమకూరుతుంది.

రైతులకు మంచి ధర ఇప్పిస్తాం



ఆయిల్‌పామ్‌కు మంచి ధర ఇప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్మల్ తోపాటు ఇతర జిల్లా ల్లో కోసిన పంటకు టన్నుకు రూ.20వేలకు పైనే ధర లభిస్తోంది. ఇది రైతులకు మంచి ఆదాయాన్ని సమకూర్చే ధర. జిల్లాలో కూడా దాదాపు ఐదున్నర వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. వచ్చే ఆరు నెలల్లో కోతకు వస్తుంది. పంట సేకరణ కేంద్రాలు జిల్లాలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు మంచి ధరను ఇప్పిస్తాం.

– బందారి శ్రీనివాస్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

సబ్సిడీపై ఆయిల్‌పామ్ మొక్కలు

దేశంలో వంటకు ఉపయోగించే నూనెలో దాదాపు 40శాతం పామాయిల్ ఉంటుంది. డిమాండ్ ఉన్నప్పటికీ మన దేశంలో పామాయిల్ సాగు తక్కువగా ఉండడంతో మలేషియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఆయిల్‌పామ్ పంటను మన దేశంలో పండించాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు రైతులను ప్రోత్సహించేందుకు మొక్కలను, డ్రిప్‌ను సబ్సిడీపై అందజేస్తూ గత ఐదేళ్లుగా సాగును పెంచేందుకు ఉద్యాన శాఖ కృషి చేస్తోంది. సబ్సిడీతోపాటు పంటకు అవసరమయ్యే ఎరువు, అంతర పంటలు సాగు చేస్తే ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు పెట్టుబడి సాయం అందిస్తోంది. ఉద్యాన, వ్యవసాయ శాఖలు కలిసి జిల్లాలో ఆయిల్‌పామ్ తోట సాగును 5,471 ఎకరాలకు చేర్చగా, ఈ ఏడాది మరింత సాగు చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు.

రాజకీయ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరిశెట్టి శ్రీనివాస్

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రంలో సంచార జాతులకు రాజకీయ అవకాశాలు లేకుండాపోయాయని, రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర సంచారజాతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తిప్పిరిశెట్టి శ్రీనివాస్, సింగజోగి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు ద్వారంగుల నగేశ్ అధ్యక్షత ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో సంచార జాతి కులాలు బీసీల్లో 52, ఎస్సీల్లో 10, ఎస్టీల్లో నాలుగు కులాలు ఉన్నాయని, జనాభా ప్రకారం బీసీల్లో 12శాతం, ఎస్సీల్లో 20 శాతం, ఎస్టీల్లో 10 శాతం ఉన్నట్లు వివరించారు. అయినప్పటికీ సంచారజాతులను పట్టించుకునే నాథుడే లేడని, సంచారజాతులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు.

సమావేశంలో బీమ్‌రాజు, వేముల రఘు, కుంచెపు ఆనంద్, రాజ్‌కుమార్, రమేశ్, గంగాధర్, దండ్ల గంగారాం, బత్తుల నాగేశ్, తిమ్మయ్య, గంగారాం పి, శ్రీనివాస్, జిల్లా సంచార జాతి కులాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మానవత్వం చాటిన మున్సిపల్ చైర్‌పర్సన్



కామారెడ్డి టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మానవత్వం చాటారు. ఆదివారం మండలంలోని ఉగ్రవాయి శివారు భవానిపేట స్టేజీ వద్ద ఉగ్రవాయి గ్రామానికి చెందిన లింగంను గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. అటువైపు వాహనంలో వెళ్తున్న చైర్‌పర్సన్ రోడ్డుపై గాయాలతో పడి ఉన్న లింగంను చూసి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి వైద్యం కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించేంత వరకు అక్కడే ఉన్నారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి వైద్యులు, సిబ్బందితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆపదలో మానవత్వం చాటిన చైర్‌పర్సన్‌కు లింగం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టడీ టూర్‌కు ఏఎంసీ పాలకవర్గం



వేల్పూర్: వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఆదివారం స్టడీ టూర్‌కు బయలుదేరి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని ప్రముఖ మార్కెట్‌లను సందర్శిస్తామని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్లు కలిసి స్టడీ టూర్‌కు వెళ్లారు.

మదన్‌పల్లి వాసికి డాక్టరేట్



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లికి చెందిన ఎస్ రామాచారికి ఇంగ్లిష్ విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ)ని గురువారం ప్రదానం చేశారు. 'అన్‌హెర్డ్ వాయిసెస్ ఎస్టడీ ఆఫ్ దళిత్ లైఫ్ నారెటివ్స్ ఆఫ్ పీఆర్ వెంకటస్వామి, వైబి సత్యనారాయణ, సుజాత గిడ్ల అనే అంశంపై ఓయూ ప్రొఫెసర్ నవీన్‌సొడ మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం రామాచారి జిల్లా కేంద్రంలోని టీజీఎంఆర్ఎస్‌లో ప్రోస్టు గ్రాడ్యుయేట్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. డాక్టరేట్ పొందడంపై పలువురు అభినందనలు తెలిపారు.

బాల్య మిత్రుని కుటుంబానికి బాసట



మాచారెడ్డి: వారితో కలిసి చదువుకున్న మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాల్యస్నేహితులు చేయి చేయి కలిపారు. రూ. 50 వేలు సమకూర్చి ఆ కుటుంబానికి అందజేసి మేమున్నామని భరోసా ఇచ్చారు. వివరాలు.. మండలంలోని చుక్కాపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఒడపల్లి నర్సింగరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో 1986–87 పదో తరగతి బ్యాచ్ మిత్రులు మృతుడి కుటుంబానికి ఆదివారం రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు.

నాటుడు.. నరుకుడు

- విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం
- వంటలపై నీడ వస్తుందని రైతులు నరికివేయడం
- జీపీ సిబ్బంది హెచ్చరించినా పట్టించుకోని వైనం



వన్నెల్(కె) సమీపంలో చెట్లను నరికివేస్తున్న దృశ్యం



రోడ్డు పక్కన నరికివేతకు గురైన చెట్లు

నందిపేట్(ఆర్మూర్): మొక్కలను నాటండి.. చెట్లను నరకండి అనే చందంగా ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. కోట్లు వెచ్చించి హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటిస్తోంది. అయితే అధికారులు లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎక్కడపడితే అక్కడ నాటడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విద్యుత్ తీగల కింద చిన్న మొక్కలు, పూల మొక్కలు నాటాలనే నిబంధన విస్మరించి వేప, రావి మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం చెట్లుగా ఎదగడంతో అవి విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న కారణంతో విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని నరికేస్తున్నారు.

నందిపేట్ మండల కేంద్రంలో రోడ్డు పక్కన అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఈజీఎస్ కూలీలతో జీపీల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అవి చెట్లుగా మారడంతో విద్యుత్ తీగలకు అడ్డుగా మారాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ట్రాన్స్‌కో అధికారులు చెట్ల కొమ్మలను నరికి వేస్తున్నారు. ఇదే అదునుగా చూసుకుని ఏపుగా పెరిగిన చెట్లతో పంటలకు నీడ వస్తోందని రోడ్డు పక్కన ఉండే పంటపొలాల రైతులు చెట్ల మొదలును నరికిస్తున్నారు. దీంతో చెట్టు మొత్తం మోడువారిపోతుంది. మండలంలోని వన్నెల్(కె)–మచ్చర్ల గ్రామం మధ్య మార్గంలో మొక్కలు చెట్లుగా మారి అటుగా వెళ్లిన వారికి నీడ నిస్తున్నాయి. ప్రస్తుతం దారి పొడవునా చెట్లు మొదలుకే నరికేస్తున్నారు. మొక్క దశలో ఉన్నప్పుడు మేకలు, గేదేలు మేస్తే యజమానులకు కనీసం రూ. 2 వేలు జరిమానా విధించాలన్న అధికారులు ప్రస్తుతం చెట్లను నరికేస్తే ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

అటవీ సంరక్షణ చట్టం–1980 నిబంధనల ప్రకారం ఎవరైనా చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకోవాలి. వన్నెల్(కె) శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్లను కొందరు నరికేశారు. చెట్లను నరికిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– కృష్ణారెడ్డి, వన్నెల్ గ్రామ మాజీ సర్పంచ్

జరిమానాలు విధిస్తున్నాం



చెట్లను నరికివేసిన వారిపై జరిమానాలు విధిస్తూ చర్యలు తీసుకుంటున్నాం. వన్నెల్(కె) గ్రామ సమీపంలో చెట్లను నరికిన వ్యక్తికి సైతం జరిమాన విధించాం. ఎవరైన చెట్ల నరికితే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో, నందిపేట

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందేదెన్నడు..?

- గ్రాట్యుటీ, జీపీఎఫ్, ఈఎల్ సొమ్ము కోసం ఎదురుచూపు
- పదవీ విరమణ పొందిన రోజే బెనిఫిట్స్ అందించాలనే ఆదేశాలు ఉన్నా తప్పని నిరీక్షణ

మోర్తాడ్: విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినా ప్రభుత్వం నుంచి అందే ఉద్యోగ విరమణ ఆర్థిక ప్రయోజనాలు (రిటైర్‌మెంట్ బెనిఫిట్స్) అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిటైరయ్యాక వచ్చే మొత్తాన్ని లెక్కలేసుకొని పిల్లల పెళ్లిళ్లు, ఇంటి నిర్మాణాలు తదితరాల కోసం ప్రణాళికలు రూపొందించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ఆరు నెలలుగా ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ అందక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో మార్చి 2024 నుంచి నవంబర్ వరకు 140 మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారు. ఈనెలలో మరో 13 మంది ఉపాధ్యాయులు రిటైర్‌మెంట్ కానున్నారు. ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల్లోని ఉద్యోగులు సైతం ఉద్యోగ విరమణ పొందారు. ఒక్కో ఉద్యోగికి సర్వీసు, వేతన లెక్కల ప్రకారం సుమారు రూ.25 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు చేతికి అందుతాయి. గెజిటెడ్ హోదాలో ఉన్న అధికారులకైతే బెనిఫిట్ మొత్తం రూ.కోటికి పైగానే అందుతుంది. ఏ శాఖలో ఉద్యోగి అయినా ఉద్యోగ విరమణ చేసిన రోజే బెనిఫిట్స్ అందించాలనే నిబంధన ఉంది. కానీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. బెనిఫిట్స్ కోసం నెలల తరబడి ట్రెజరీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది.

మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన మగ్గిడి శంకర్ పాలెం ఉన్నత పాఠశాలలో సామాన్యశాస్త్రం బోధించేవారు. జూలై 31న ఉద్యోగ విరమణ పొందారు. శంకర్‌కు అందాల్సిన గ్రాట్యుటీ, జీపీఎఫ్, ఈఎల్స్‌కు సంబంధించిన సొమ్ము ఇంకా అందలేదు.

ఉద్యోగ విరమణ సమయంలో తమను ఇలా ఇబ్బందులు గురిచేయడం తగదని పలువురు రిటైర్‌మెంట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ విరమణ పొందే ప్రతి ఉద్యోగికి వెంటనే బెనిఫిట్స్ అందేలా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి..



ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ సొమ్ము అందించడంలో ప్రభుత్వం స్పందించాలి. ఎంతో మంది తమకు రిటైర్‌మెంట్ రోజున పెద్ద మొత్తంలో సొమ్ము చేతికి వస్తుందని ఆ డబ్బుతో ఇంటిని నిర్మించడం, పిల్లల భవిష్యత్‌కు వినియోగించడం చేస్తారు. ప్రభుత్వం స్పందించి బెనిఫిట్స్ త్వరగా అందేలా చూడాలి.

– దోస్‌పాల్ సత్యానంద్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ధర్మారం విద్యార్థులు



బాన్సువాడ మండలం కొత్తాబాదిలో..



ఆర్మూర్‌లోని విజయ్ హై స్కూల్ విద్యార్థులు

డిచ్‌పల్లి/ ఆర్మూర్ టౌన్/ బాన్సువాడ రూరల్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం పదో తరగతి చదివిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) హైస్కూల్‌లో 2006–07, ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హై స్కూల్‌లో 1998–99, బాన్సువాడలోని కొత్తాబాది జెడ్పీహైస్కూల్‌లో 2004–05కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్మ సమ్మేళనాలు నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు అందరూ ఒకేచోట కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు.

పోలీస్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 2009 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముందు బ్యాచ్‌లో మృతి చెందిన కానిస్టేబుళ్లకు నివాళులు అర్పించారు. అనంతరం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. శిక్షణ కాలంలో జరిగిన ఘటనలు, అనుభూతులను పంచుకున్నారు.

10న విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్‌రావు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బాల్‌భవన్‌లో ఈ నెల 10న జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి కార్యశాల, బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు పేర్కొన్నారు. బాల్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు కవిత, రచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి డీఈవో అశోక్ రానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఈ వేదిక కథా, కవితా రచన మీద కార్యశాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఇందూరు బాల సాహిత్య వేదిక మహిళా కార్యదర్శి డాక్టర్ శారద, కోశాధికారి చింతల శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శులు వసంత లక్ష్మణ్, కందకుర్తి ఆనంద్ పాల్గొన్నారు.

దినకర్మకు వస్తూ.. అనంత లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు





మృతి చెందిన లక్ష్మి(ఫైల్) అక్షయ్‌రెడ్డి(ఫైల్)

భిక్కనూరు/ బాన్సువాడ: మృతి చెందిన బంధువు దినకర్మకు వస్తున్న తల్లీకుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ పట్టణానికి చెందిన కంచర్ల అక్షయ్‌రెడ్డి(28) పేటీఎం కంపెనీలో మార్కెటింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లోని అంబారిపేటలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. పది రోజుల క్రితం వారి బంధువు బాన్సువాడలో మృతి చెందగా ఆదివారం చేపట్టే దినకర్మ కార్యక్రమానికి అక్షయ్‌రెడ్డి కారులో తనతో పాటు తల్లి లక్ష్మి(49), అమ్మమ్మ కొర్ల భూమవ్వ, మేనమామ రాజేశ్వర్‌రెడ్డితో కలిసి బాన్సువాడకు ఉదయం హైదరాబాద్ నుంచి వస్తున్నారు. ఉదయం 6.50 నిమిషాల ప్రాంతంలో పొగమంచు ఉన్నందున రోడ్డు కనిపించక భిక్కనూరు సమీపంలోని జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో కారు ముందరి భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న అక్షయ్‌రెడ్డి కారులో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి, భూమవ్వ, రాజేశ్వర్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందింది. రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాలీ లారీ డ్రైవర్ వెంటనే తన వాహనంతో పారిపోయాడు. పోలీసులు వెంబండించి లారీని పట్టుకున్నారు. అక్షయ్‌రెడ్డి తాత సంగారెడ్డి గతంలో బాన్సువాడ సర్పంచ్‌గా పనిచేశాడు. సంగారెడ్డి కుమార్తె అయిన లక్ష్మిని కొండల్‌వాడికి చెందిన నర్సింహారెడ్డికి ఇచ్చి వివాహం చేయగా వారికి అక్షయ్‌రెడ్డి జన్మించాడు. వీరు బాన్సువాడలో ఉండగా అక్షయ్‌రెడ్డికి ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లోని అంబారిపేటలో నివాసం ఉంటున్నారు. ఘటన స్థలాన్ని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ప్రమాదంలో మృతిచెందిన, గాయపడ్డ వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను పోలీసులు కుటుంబీకులకు అందజేశారు.





ప్రమాదంలో గాయపడ్డ భూమవ్వ, రాజేశ్వర్‌రెడ్డి

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



విచారణ చేపడుతున్న ఎస్సై రాజు

కామారెడ్డి క్రైం: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గర్గుల్‌కు చెందిన గంగపురం లింగయ్యకు భార్య పోచవ్వ(30), ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు సంచార జీవనం గడుపుతూ భిక్షాటన, కూలీ పని చేస్తుంటారు. కొన్ని రోజుల క్రితం అడ్లూర్ గ్రామానికి చివరన ప్లాస్టిక్ కవర్‌తో గుడారం వేసుకుని ఈ ప్రాంతంలో భిక్షాటన, పనులు చేసుకుంటున్నారు. ఆదివారం ఉద యం 9 గంటల ప్రాంతంలో పోచవ్వ గుడారంలో మృతి చెంది ఉంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆమె తండ్రి కోట పోచయ్య, బంధువులు గ్రామానికి చేరుకున్నారు. మృతదేహంపై గాయాలు కనిపించడంతో భర్త లింగయ్యనే హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ దాడి చేయబోయారు. దీంతో అతను అక్కడి నుంచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. శనివారం సాయంత్రం తాను భిక్షాటనకు వెళ్తున్నప్పుడు తల్లిదండ్రులు గొడవ పడుతున్నారని, తిరిగి వచ్చే సరికి తల్లి పోచవ్వ చనిపోయి ఉందని మృతురాలి పెద్ద కుమారుడు దుర్గేశ్ తెలిపినట్లు బంధువులు చెబుతున్నారు. శనివారం రాత్రే ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

న్యాయవాదిపై దాడి కేసులో హైకోర్టులో క్వాష్ పిటిషన్

ఖలీల్‌వాడి: న్యాయవాది మహమ్మద్ ఖలీద్ రహమాన్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులు కేసును తొలగించాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లారోడ్డులోని న్యాయవాదికి చెందిన షెటర్‌ను తమకే విక్రయించాలని అదే ప్రాంతానికి చెందిన హర్షద్‌ఖాన్ అడిగితే అమ్మనందుకు ముజఫర్‌ఖాన్, మజీద్‌ఖాన్ గత నెల 24న న్యాయవాది మహమ్మద్ ఖలీద్ రహమాన్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో నిందితులపై రెండో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా దాడికి పాల్పడిన హర్షద్‌ఖాన్, ముజఫర్‌ఖాన్, మజీద్‌ఖాన్ పరారీలో ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అయితే ఈనెల 4న హర్షద్‌ఖాన్ కేసును కొట్టేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దఖాలు చేయడంతో సోమవారం హైకోర్టులో బెంచ్‌పైకి రానున్నది. దీంతో కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ ఆధారంగా కేసుపై తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయి. న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తుండడంపై రాజకీయ నాయకుల హస్తం ఉందనే ప్రచారం నగరంలో వినిపిస్తోంది. న్యాయవాదిపై దాడి చేస్తేనే పట్టించుకుని పోలీసులు సామాన్య ప్రజలకు ఎలాంటి న్యాయం చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇకనైనా పోలీసులు హైకోర్టులో క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసి న్యాయవాదికి న్యాయం చేయాలని నగరప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్సై యాసిన్ అరాఫత్‌ను వివరణ కోరగా క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు.

వన్నెల్(బి)లో మహిళ దారుణ హత్య

- నిద్రిస్తుండగా గొడ్డలితో వేటు
- భర్తే హతమార్చినట్లు పోలీసుల అనుమానం



శివకళ మృతదేహం

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)లో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలుక బెల్లకోని గ్రామానికి చెందిన రాజగంగారాం భార్య జంగం శివకళ(33)తో కలిసి మూడేళ్ల క్రితం వన్నెల్(బి)కి ఉపాధి కోసం వచ్చారు. గ్రామంలో కలిగోట్ దేవేందర్ అనే వ్యక్తి వద్ద వ్యవసాయ పనులకు జీతం ఉన్నారు. రాజగంగారాం మద్యానికి బానిసై వ్యవసాయ పనులకు వెళ్లకుండా భార్యను వేధించేవాడు. తన భర్త మద్యం మానేందు కోసం శివకళ రెండు రోజుల క్రితం ఇతర ప్రాంతాల్లో మందులు పోయించింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న అతను శనివారం ఉదయం నుంచి గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆరు గంటలు దాటినా శివకళ పాలకోసం ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన యజమాని దేవేందర్ కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూశారు. ఆమె మంచంపై విగతజీవిగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆమె నిద్రలో ఉండగానే గొడ్డలితో తలపై బాది హత్య జరిగి ఉంటుందని పోలీసులు తెలిపారు.

భర్తే హంతకుడా..?

గ్రామానికి ఉపాధి కోసం వచ్చిన రాజగంగారాం శివకళ దంపతులు ఇద్దరే ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. రెండు రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కోపంలోనే భర్త ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజగంగారాం పరారీలో ఉన్నాడు. హత్య విషయం తెలుసుకున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. త్వరలో కేసును చేదించి నిందితుడిని పట్టుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై నరేశ్, సిబ్బంది ఉన్నారు.

డీజిల్ చోరీ కేసులో నిందితుల పట్టివేత



నిందితులను వివరాలను వెల్లడిస్తున్న సీఐ

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి, ఖిల్లా వద్ద ఉన్న సెల్‌టవర్ల జనరేటర్ల నుంచి డీజిల్‌ను దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను ఆదివారం పట్టుకొన్నట్లు సీఐ మల్లేశ్, ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. సీఐ కార్యాలయంలో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. ఇందల్వాయి మండలానికి చెందిన తిర్మన్‌పల్లి గ్రామస్తులు మహమ్మద్ సమీర్, కలిగోట్ సాకలి కార్తీక్ మరో మైనర్‌తో కలిసి డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, సదాశివనగర్ మండలాల్లో సెల్‌టవర్ల జనరేటర్ల నుంచి డీజిల్‌ను దొంగతనం చేసి ఇతరులకు విక్రయించే వారు. ఇప్పటి వరకు 900 లీటర్ల డీజిల్‌ను దొంగలించారని అన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో..



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీలకు పాల్పడే నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట్ మండలం బినోలా గ్రామానికి చెందిన ఎరుకుల ప్రశాంత్ అనే యువకుడు బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో అతనిపై నిఘా ఉంచి పట్టుకున్నట్లు తెలిపారు. విచారణలో అతను జల్సాలకు అలవాటు పడి బైక్‌లను చోరీలకు పాల్పడుతున్నట్లు నేరం అంగీకరించాడు. అనంతరం పోలీసులు మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకున్న ఏఎస్సై షకీల్, పీసీలు గంగారాం, రవిలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

రికవరీ సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి:మండలంలోని ఎల్లంపేట గ్రామాని కి చెందిన దండ్ల కొమురయ్య ఇటీవల తన సె ల్‌ఫోన్ను పోగొట్టుకున్నారు.ఈ విషయమై పో లీసులకు ఫిర్యాదు చేయగా..మాచారెడ్డి ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా రికవరీ చేశారు.ఆఫో న్‌ను ఆదివారం కొమురయ్యకు అప్పగించారు.

తాడ్‌బిలోలిలో స్కూటీ చోరీ

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలిలో ఓ ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన స్కూటీని దుండగులు శనివారం రాత్రి చోరీ చేశారు. గ్రామానికి చెందిన దయాకర్‌రెడ్డి శనివారం సాయంత్రం ఇంటి ఎదుట స్కూటీని పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లగా రాత్రి చోరీకి గురైంది. గ్రామంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా గుర్తుతెలియని యువకులు రెక్కీ నిర్వహించి బోర్గాం మీదుగా వాహనాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మిర్చి కంపౌండ్‌లో మరొకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చి కంపౌండ్ ప్రాంతంలో ఒకరి హత్య జరిగినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షేక్ యూసుఫ్(50) ప్రతి రోజు పట్టణంలో తిరుగుతూ రాత్రి మిర్చి కంపౌండ్ ప్రాంతంలోని పాత ఇనుప సామాగ్రి దుకాణం వద్ద పడుకుంటాడు. శని వారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి యూసుఫ్ గొంతుపై బలమైన గాయం చేయడంతో రక్తం కారి మృతి చెందాడు. దుకాణ యజమాని నజీర్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

చీటీ వ్యాపారి అదృశ్యం?

ఆర్మూర్‌టౌన్: వ్యాపారాల్లో దివాల తీయడం, ఐపీ(ఇన్‌సాల్‌వెన్సి పిటిషన్) పెట్టడం పరిపాటిగా మారింది. కొందరు వ్యాపారాల్లో నష్టపోయి చేసిన అప్పులను తీర్చలేక కోర్టును ఆశ్రయిస్తే మరికొందరు అప్పులు తీర్చే స్తోమత ఉన్నా డబ్బుల ఎగవేతకు ఐపీలు పెడుతున్నారు. ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన ఓ చీటీ వ్యాపారి గత 15 రోజులుగా కనిపించడం లేదు. దీంతో చీటీ సభ్యులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. సదరు వ్యాపారి గ్రామంలో మిత్రులు, బంధువులు, పరిచయస్తుల నుంచి చీటీలు వేయించాడు. సభ్యులకు చీటీ డబ్బులు చెల్లించకపోగా గ్రామం నుంచి కనబడకుండా పోవడం చర్చనీయంగా మారింది.

రామేశ్వర్‌పల్లిలో..

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన జ్యోతి మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.